# వొళ్ళుచేసి చూడు

తిండి తింటే కండ కలదోయ్, కండ కలవాడే మనిషోయ్ అని మన తెలుగు కవిగారు కండరాల ఆవశ్యకతని నొక్కి వక్కాణించి మరీ చెప్పారు. బాగానేవుంది కాని పాయింటల్లా ఈ రోజుల్లో అంత కండపట్టే తిండి ఏం వుందాని బియ్యంలో మట్టిగడ్డలు , కందిపప్పులో కంకర్రాళ్ళు, పంచదారలో మైదా, పంపు నీళ్ళలో డ్రయినేజి నీళ్ళు, గాలిలో ఫ్యాక్టరీల పొగ – ఇలా అన్నీ కలుషితం అయ్యేక, కండలు పట్టడం అటుంచి, కాలం చెయ్యకుండా వుంటే అదే పదివేలనే పరిస్థితుల్లో మనం బతుకుతున్నాం. పర్వాతాల్లాంటివాళ్ళు పీనుగులయిపోతున్నారు. గుండెదడ, రక్తపోటు, షుగరు, కీళ్ళ నొప్పులు ముప్పయేళ్ళకే మొదలువుతున్నాయి. ఇహ గుండెజబ్బు సరేసరి – వయసుతో సంబంధంలేకుండా పోయింది. ఎవరికయినా, ఏ క్షణానైనా రావచ్చు.

కాని, ఏమాటికామాట చెప్పుకోవాలి – ఆడవాళ్ళు గాని, మొగవాళ్ళుగాని వొళ్ళు చేస్తే చూట్టానికి ముచ్చటగా వుంటారు.

ఆడదంటే పచ్చరటిపండులాగాను, మగాడు చక్కెరకెళీగాను వుండాలంటాడు మా ఫ్రెండు. అరటి పండులు, చక్కెరకేళీల్లాగా ఎదిగి, అక్కడ ఆగిపోతే అందంగానే వుంటుంది. కాని వాళ్ళు రెచ్చిపోయి, విజృభించి గవిడిగేదె , నీళ్ళ గుండిగల్లాగా పెరిగిపోతే చూడటానికి మనకి, చూడకుంటానికి వాళ్ళకీ కూడా ఇబ్బందిగాను, అసౌకర్యంగాను వుంటుంది. కొన్ని రకాల శరీరాలకి వొళ్ళు అకారణంగా వస్తుంది. – బెలూన్లోకి గాలి పంపినట్లే . కాని ఇంకొంతమందికి ఎంత తిన్నా పోస్టు డబ్బాలో పడేసినట్లే కాని, ఫలితం వుండదు. దీన్ని గురించి మెడికల్ సైన్సువారేం చెప్తారో తెలీదు గాని, మనకి మాత్రం నిగూఢమైన సృష్టి రహస్యమే ! నే చదూకునే రోజుల్లో శంకర్రావని ఓ మిత్రుడొకడుండేవాడు. కత్తిలాంటి కుర్రాడు. చదువులో ఫస్టు. ప్రతి సంవత్సరం గోల్డు మెడల్సు, ర్యాంకులు అతనికే దక్కేవి. ప్రిన్సిపాలు దగ్గర్నించి కాలేజీ ప్యూను దాకా అందరికి అతనంటే అభిమానం. కాలేజీకి గర్వకారణం. కాని శరీర రీత్యా అర్భనాకారి. అయిదడుగుల ఎత్తు , బట్టతల , పొట్లకాయల్లాంటి చేతులు, సొరపిండెలంత కాళ్ళు, గుండెలు ఎండిపోయి ఎముకలు స్పష్టంగా కనిపించేవి . ఆటల్లోకి, స్పోర్ట్సులోకి తీసుకునేవారు కాదు. ఆటగాళ్ళ బట్టలు, రిస్టువాచీలు పట్టుక్కూర్చునేవాడు. చదవయింది.

మంచి ఉద్యోగమే వచ్చింది. ధైర్యంచేసి పెళ్ళి ప్రయత్నాలు ప్రారంభించేడు. కానీ బేరాలొస్తే వొట్టు. ప్రతివాళ్ళూ పిల్లవాడిని చూడగానే పత్తా లేకుండా వెళ్ళిపోయేవాళ్ళు . అబ్బాయి మరీ బలహీనంగా వున్నాడనో, మా పిల్లకి జోడు కాదనో, ఇంకొంతమంది అసలేదైనా జబ్బుగాని వుందేమో నంటూ సందేహాలు వెలిబుచ్చి వెళ్ళిపోయేవాళ్ళు . పెళ్ళిళ్ళ పేరయ్య గారు ప్రాణం విసిగి కళ్యాణ యోగం లేదని ప్రకటించి పారిపోయేరు. వొళ్ళు రావాలంటే ఏం చెయ్యాలని కనిపించిన ప్రతివాళ్ళని అడిగే వాడు. కొంతమంది వ్యాయామం చెయ్యమన్నారు. చేస్తే కాళ్ళు, చేతులు బిగుసుకుపోయి మర బొమ్మలాగా నడవటం ప్రారంభించేడు. కొంతమంది భోజనం కోటా పెంచమన్నారు. రోజుకి మూడు సార్లు తినేవాడు. పళ్ళరసాలు, పాలు తాగమన్నారు. తాగేవాడు. నవగ్రహాలకి ప్రధిక్షణలు చెయ్యమన్నారు. చేశాడు. డాక్టర్ని కలిశాడు. మందులు వాడేడు. కాని వొళ్ళు చేస్తే వొట్టు, పెళ్ళయితే వళ్ళు వస్తుందని కొందరంటే వొళ్ళు లేకే పెళ్ళి కావటం లేదని నిజాయితీగా చెప్పేవాడు. తర్వాత ఏం తిప్పలు పడ్డాడో నాకయితే తెలియదు గాని, మొన్నీమధ్యన చాలాకాలం తర్వాత కల్సాడు…ఆశ్చర్యపోయాను. దాదాపు ఖైరతాబాద్ గణేశ్ విగ్రహం అంతున్నాడు. చూస్తుంటే గుండె తరుక్కుపోయింది.

కదలలేడు మెదలలేడు. నాలుగడుగులు నడవలేడు. వీధి చివర్న కాఫీ హొటలుగ్గూడా రిక్షాలో వెడతాట్ట. ఇంత ఘోరం ఎలా జరిగిందంటే , తెలీదన్నాడు. వొళ్ళు కోసం అన్ని ప్రయత్నాలూ చేసి విసుగెత్తి వూరుకున్నాట్ట. అంతే వూపందుకుందిట. లాకులు తెరిచినట్లు లావయిపోయాట్ట. వొళ్ళొచ్చేక పెళ్ళి ప్రయత్నాలు రెన్యూల్ చేస్తే ఇంత లావుపాటి వాళ్ళకే గుండెజబ్బు రావటం ఖాయం అన్జెప్పి గిరాకీలు వెనక్కిపోయాయిట.

ఇలాంటివాళ్ళకోసం నగరాల్లో కొత్త రకం సెంటర్లు వెలుస్తున్నాయి. వొళ్ళు తగ్గిస్తాం. గేరంటీ అంటున్నారు. నమ్మి చేరేవాళ్ళూ వున్నారు. మొన్ననీ మధ్యన ఇటువంటి ఒక సెంటరు ముందు మారుతీ కార్లోంచి ఒక భారీ కాయాన్ని ముగ్గురు బయటికి లాగటం చూసేను. లోపల సీటుకి, స్టీరింగుకి చక్రానికి మధ్యన ఇరుక్కుపోయేడు. బయటికి లాగినవాళ్ళకి యాభయ్యి, లోపలికి నెట్టినవాళ్ళకి నలభై చొప్పున మనుషుల్ని పెట్టుకున్నాడు. అయినా దిగుళ్ళు, సమస్యలు వుంటే చిక్కి సగం అవుతారని మనవాళ్ళంటూ వుంటారు. అంచేత వొళ్ళుచేసినవాళ్ళు వర్రీసు పెంచుకోటం బెటరు – దట్సాల్.

-------- అయ్యిపోయింది --------